# తాతబ్బాయి కథ



వెర్రినాగన్నా, ఈతరం సజ్జు ఉట్టి కుర్రనాగమ్మలు. అప్పు అడకంకూడా చేతగాదు. ఎందుకు పనికొస్తారంట. మా కాలంలో ఇలాగేనా. మన తాతబ్బాయి ఉన్నాడంటే ఎంత గట్టివాడూ.... వాడు అప్పుజ్జేస్తే

ఇలాగే చేశాడా, ఇంత అవకతవకగానే అడిగాడా మరి. నీకు తెల్సా వాడి పెళ్ళి సంగతి. [తెలీదన్న భావానికి అభినయంగా అరుగుమీద కూలబడి స్తంభానికి జేరబడ్డాడు గుర్నాథం] నాన్నమ్మ కూతురు వరాలమ్మకు మనువెలా అయిందని. అదంతా ఓ కథగాదూ మరి. తాతబ్బాయీ, రావకిష్టుడూ ఇద్దరూ తోడబుట్టినవాళ్ళేనాయె. ఏణ్ణార్ధం అటూ ఇటూ గాళ్ళేనాయె. పిల్లదాన్ని ఎవడికిచ్చి ఎవడిక్కాదనేట్టుటా. ఓనాడు మధ్యాన్నవేళ కుర్రాళ్ళిద్దరూ జెమాజెట్టీల్లా, రావలక్ష్మణుల్లా పోటాన పోటీలు పడుతూ వాకిట్లో చలవ పందిరేస్తూ వుండగా నానమ్మకేం వూహటోయిందో మరి—ఒరే తాతిగా ఒరే రావకిష్టుడూ అదలా ఒగ్గేసి మీరిలా రండర్రా అంది. అప్పగారంటే ఇద్దరికీ హడలే. పని ఉన్నపళంగా వదిలేసి చేతులు గట్టుకు నిలబడ్డారు. అరుగుపక్కన నానమ్మ పిల్లదానికి మొగజ్జడేస్తోంది. ఏవిరా రావకిష్టుడూ వరాల్నిచ్చి పెళ్ళి జేస్తాగాని కూడెట్ట గలవర్రా అంది. రావకిష్టుడు గర్వంగా చిన్నాడికేసి చూసి వరాల్ని ఓరకంట చూసి చెస్ పెళ్ళాని కూడెట్టలేని వాడుంటాడెస్. అంతగా యేం లేకపోతే అడుక్కు దెచ్చన్నా పెట్టనా అన్నాడు.

ఓరి నీయింట కోడిగాల్చా, ఏం కూత కూశావురా. కొంపకీ కులానికీ కూడా అపద్రిష్ట మాటంటివిగదరా. మా లక్ష్మినిచ్చి మనువుజేసే అడుక్కుతెచ్చి వణ్ణం పెడతా నంటావుర్రా అంది నానమ్మ నవ్వి.

మరి తాతబ్బాయీ నీ మాటేవిటిరా, నువ్వూ పట్నంలో అడుక్కు దెస్తానంటావా అంది ఇంకో క్షణం ఆగి.

చెచేస్. అడుక్కోడవేంగతి అప్పా. సంపాయిత్తా. అందాకా

అవసరమైతే ఎవడితలో తాకట్టేసి అప్పుదెచ్చి బువ్వపెడతా. ఆపాటి మొగాణ్నికానా.

ఎవడూ ఇవ్వకపోతే నువ్వు ఇస్తావు అప్పు అన్నాడు తాతబ్బాయి ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

నీ కడుపు చల్లగుండ. ఎంతమాటన్నావురా కడుపులో ఎంతోటి ఊహలున్నాయి అని ముక్కున వేలేసుకుని అలాగే విస్తుబోయింది నానమ్మ.

అమ్మో జెడయ్యేవేవ్. మెడ నెప్పెడతాది అని మాలక్ష్మి వరాలు గావుకేకేసేవరకూ తల్లి తేరుకోనేలే.

సరే ఇద్దరిలోనూ తాతబ్బాయి ఇంత ప్రవేజకుడుగదా — అని ఇంటిల్లపాదీ పెద్దవాడు రావకిష్ఠుడు వేపే మొగ్గినా నానమ్మ పట్టుబట్టి పిల్లని వీడికే కట్టబెట్టింది. మరి తరవాత వాడెంత ప్రవేజకుడైనాడనీ. అప్పుల్జెయ్యడం కూడా ఏమంత గొప్పపని కాదనుకో. అయితేనేం అందులో తలకాయలు మార్చడం, మాట సుళువూ, మనిషి సుళువూ తెలీడం ఉన్నాయి. తాతబ్బాయి ఇల్లుగట్టాడు, గుర్రబ్బండికొన్నాడు. పెద నాయుడనిపించుకున్నాడు. వాడు అప్పుచేశాడంటే చేసినట్టే ఉండేదికాదు. ఇచ్చినాడికూడా తెలిసేది గాదన్నమాట. ఒక్కనాకాడె వాడి ఆట సాగి రాలేదు. నేనీ విషయంలో కాలాంతకుణ్నిలే... ఎవరదీ ఆవచ్చేది? నాన్నా చీకటడింది, కోడలు పిల్లను దీపంబెచ్చి పెట్టమనూ వాకిటా. ఎవరది నర్సయ్యా! రా రా రావయ్యా అలా కూర్చో అన్నారు మునసబుగారు కథ ఆపి.